సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



రూ.70 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి క్షేత్రంలో నిత్యాన్న దాన భవన నిర్మాణానికి రుద్రరాజు వెంకట సత్యరామకృష్ణరాజు, లక్ష్మి దంపతులు ఆదివారం రూ.70 వేల విరాళం సమర్పించారు.



నిత్యాన్నదానానికి..

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి కర్రి కృష్ణారెడ్డి, సూర్య కుమారి దంపతులు (పసలపూడి) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

కడలిలోకి 75 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 75,386 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7 వేల చొప్పున డెల్టా కాలువలకు మొత్తం 14,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.35 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

అంతర్వేదిలో 23 నుంచి పవిత్రోత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధిలో ఈ నెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. దేశ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలనే ఉద్దేశంతో ఈ ఉత్సవాలను నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన కోరారు.

భీమేశ్వరాలయంలో అయోధ్య రామయ్య పాదుకలు



అయోధ్య రాములవారి పాదుకలను దర్శించుకుంటున్న ఈఓ తారకేశ్వరరావు, భక్తులు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అయోధ్య రాములవారి కోసం రూపొందించిన రజత పాదుకలను భక్తుల దర్శనార్థం ఉంచారు. ముందుగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఈ పాదుకలను శిరస్సుపై ధరించి డోలు, సన్నాయి మేళాలతో ఆలయంలోకి తీసుకు వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ హోమందారుల సమక్షంలో భక్తులు దర్శనం చేసుకునేందుకు ఏర్పాట్లు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

అప్పనపల్లి.. భక్తులతో శోభిల్లి



ఉభయ దేవేరులతో కొలువు దీరిన బాల బాలాజీస్వామివారు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్న పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు ఉదయం నుంచే పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారికి తలనీలాలు, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, తమ కోర్కెలు నెరవేర్చాలని స్వామివారిని వేడుకున్నారు. బాలాజీ స్వామిని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.1.24 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.90,440, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.33,754 సమకూరిందన్నారు. 2,275 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 1,593 మంది అన్న ప్రసాదం స్వీకరించారని తెలిపారు.

శ్రీ గణేశ... జై గణేశ



అయినవిల్లి ఆలయంలో లక్ష్మీగణపతి హోమ పూజల్లో భక్తులు

అయినవిల్లి: శ్రీ గణేశ.. జై గణేశా అంటూ విఘ్ననాయకుడిని భక్తులు కొలిచారు. అయినవిల్లి విఘ్నేశ్వర ఆలయంలోని ఆ స్వామి వారిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. ఆదివారం ఉదయం ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ జరిగింది. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమాల్లో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 33 మంది, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 305 మంది, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 20 మంది పాల్గొని పూజలు చేశారు. 14 మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. 16 మంది నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,64,296 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

మేఘమా.. వర్షించుమా..

- మబ్బులు కమ్ముకుంటున్నా అంతంత మాత్రంగానే వానలు
- ఆగస్టులో 67.4 శాతం లోటు వర్షపాతం
- వేసవిని తలపిస్తున్న ఎండలు
- 34 నుంచి 36 డిగ్రీల వరకూ నమోదు
- పెరిగిన విద్యుత్ వినియోగం
- తొలకరి పంటలకు తెగుళ్ల బెడద



మండపేట: ఆకాశం మేఘావృతమవుతున్నా వానలు అంతంత మాత్రమే. కారుమబ్బులు చూసి కుండపోత కురుస్తుందనుకుంటే.. చిరుజల్లులతోనే మబ్బులు ఆవిరైపోతున్నాయి. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా కురవాల్సిన సాధారణ వర్షపాతంలో సగం కూడా పడలేదు. మరోపక్క మరో వేసవి వచ్చినట్టు ఎండలు కూడా మండిపోతున్నాయి. పగలు ఎండ, రాత్రి ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదే సమయంలో విద్యుత్ వినియోగం కూడా గణనీయంగా పెరిగిపోయింది. ఈ ప్రతికూల వాతావరణం తొలకరి పంటపై తెగుళ్లను వ్యాపింపజేస్తోంది.

ప్రభావం చూపని 'నైరుతి'

- ఈ ఏడాది ఆలస్యంగా వచ్చిన నైరుతి రుతు పవనాలు ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో ప్రభావం చూపలేదు. మూడు నెలలుగా జిల్లాలో లోటు వర్షపాతమే నమోదవుతోంది.
- ఆగస్టులో విస్తారంగా వర్షాలు కురవాల్సి ఉండగా ఒక మోస్తరు జల్లులు మాత్రమే పడ్డాయి. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా 209 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ 68.2 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. ఆ నెలలో ఏకంగా 67.4 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం గమనార్హం.
- జూన్‌లో 36.6 శాతం, జూలైలో 21.2 శాతం చొప్పున లోటు వర్షపాతం నమోదైంది.
- గత మూడు నెలల్లో మొత్తం 561.6 మిల్లీమీటర్ల వర్షపాతానికి గాను 328.6 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. మొత్తంగా 233 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం ఉందని లెక్కలు చెబుతున్నాయి.
- జిల్లాలోని ఉప్పలగుప్తం, కపిలేశ్వరపురం, కె.గంగవరం, ఐ.పోలవరం, అంబాజీపేట, కాట్రేనికోన మండలాల్లో 50 శాతం కన్నా ఎక్కువ లోటు వర్షపాతం నమోదైంది.

ఉక్కిరిబిక్కిరి

ప్రస్తుత వర్షాకాలంలో సైతం వేసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 36 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సైతం 26 నుంచి 28 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉంటున్నాయి. ఎండల తీవ్రతకు ఉక్కపోత తోడవడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫలితంగా పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం కూడా బాగా అధికమైంది. మరోపక్క తొలకరి సీజన్ కావడంతో వ్యవసాయ మోటార్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఆగస్టు నెలలో విద్యుత్ వినియోగం 225 మిలియన్ యూనిట్ల నుంచి ఏకంగా 278.7 మిలియన్ యూనిట్లకు పెరిగిందని ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు చెప్పారు.

పంటలపై ప్రతికూల వాతావ'రణం'

జిల్లాలోని గోదావరి తూర్పు, మధ్య డెల్టాల పరిధిలోని 1.74 లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేస్తున్నారు. జూలై 15వ తేదీ నాటికి నాట్లు పూర్తి చేయడం లక్ష్యం కాగా రుతుపవనాల రాకలో జాప్యం పనులపై ప్రభావం చూపింది. నెలాఖరు వరకూ కోనసీమలోని పలు ప్రాంతాల్లో నాట్లు వేస్తూ వచ్చారు. ముందుగా సాగు చేసిన మండపేట, రామచంద్రపురం, కొత్తపేట తదితర నియోజకవర్గాల పరిధిలో పంట పిలకలు పట్టి, దుబ్బు చేసే దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పలుచోట్ల మాగుడు, ఎర్రనల్లి ప్రభావం ఎక్కువగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. ఈ తెగుళ్లను అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. యూరియా ఎరువులు ఎక్కువ వేసిన, పొటాషియం వేయని పొలాల్లో తెగుళ్ల మరింత ఎక్కువగా కనిపిస్తున్నాయని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఎర్రనల్లి తగ్గే వరకూ యూరియా వేయడం ఆపాలని, మాగుడు ఉధృతిని అరికట్టేందుకు పొలం చుట్టూ గట్లను శుభ్రం చేసుకోవాలని, పొటాష్ వేయని పొలాల్లో పొటాష్ వేయాలని సూచిస్తున్నారు.

మూడు నెలల్లో జిల్లా వర్షపాతం వివరాలు

నెల	కురవాల్సినది (మి.మీ.)	కురిసింది (మి.మీ.)	లోటు (మి.మీ.)	లోటు (శాతం)
జూన్	111.4	70.6	40.8	36.6
జూలై	241	189.8	51.2	21.2
ఆగస్టు	209.2	68.2	141	67.4

సూచనలు చేస్తున్నాం..



వర్షాభావ పరిస్థితులు ఉన్నా ఖరీఫ్ వరికి ఎటువంటి ఇబ్బందీ లేదు. పంటలపై తెగుళ్లు అక్కడక్కడ కనిపిస్తున్నాయి. అలాంటి చోట రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సినా అవసరం లేదు.

– బోసుబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

అడ్డంగా దొరికి బొంకడం చంద్రబాబు నైజం

- ఐటీ నోటీసులపై అదే రాద్ధాంతం
- ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు బాబి



అమలాపురం టౌన్: టీడీపీ అధినేత చంద్రబాబు నాడు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి తప్పించుకునేందుకు అడ్డదారులు తొక్కాడని, ఇప్పుడు గతంలో నొక్కేసిన రూ.కోట్ల బాగోతంలో ఐటీ ఇచ్చిన నోటీసులపై కూడా తప్పును తొక్కిపెట్టి బొంకుతున్నాడని ఏపీ అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు (బాబి) అన్నారు. ఆదివారం అమలాపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఐటీ నోటీసులు ఇస్తే స్థానిక అధికారులు ఇవ్వాలే తప్ప సెంట్రల్ ఆఫీసు నుంచి ఇవ్వడం ఏమిటని బాబు తనదైన శైలిలో బొంకడం సరికాదని బాబి అన్నారు. నాడు ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన అతను ఆ విషయాన్ని పరోక్షంగా ఒప్పుకుంటూనే తన ఫోన్‌ను ఎవరో ట్రాప్ చేశారని అడ్డగోలుగా వాదించాడన్నారు. ఇప్పుడు కూడా ఐటీ నోటీసుల విషయంలో తాను అవినీతికి పాల్పడిన విషయంపై స్పష్టత ఇవ్వకుండా సెంట్రల్ ఆఫీస్ నుంచి నోటీసులు ఇవ్వడం ఏంటని ఎదురు దాడికి దిగుతున్నాడని గుర్తు చేశారు. ఐటీ నోటీసులతో చంద్రబాబు అవినీతి అక్రమాలు వెలుగు చూస్తున్నా నీతి వ్యాఖ్యాలు పలికే అతని దత్త పుత్రుడు పవన్‌కల్యాణ్ కనీసం స్పందించకపోవడం వారి మధ్య ఉన్న అవగాహనకు అద్దం పడుతోందని అన్నారు. టీడీపీ హయాంలో బాబు అవినీతి అక్రమాలతో సొంత ఆస్తులను కూడబెట్టుకుంటే.. ఇప్పుడు జగన్ ప్రభుత్వం ప్రతి పైసాకు లెక్కలు చూపి సంక్షేమ ఫలాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు.

నవోదయలో ప్రవేశానికి 3,548 దరఖాస్తులు

రాయవరం: జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి 3,548 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధి పెద్దాపురంలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి రెండు నెలల కిందట నోటిఫికేషన్ జారీ అయ్యింది. కోనసీమ జిల్లా పరిధి ఏడు నియోజకవర్గాల నుంచి 3,548 మంది విద్యార్థులు ఆరో తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అమలాపురం బ్లాక్ పరిధిలో 794, కొత్తపేట బ్లాక్ నుంచి 479, మండపేట బ్లాక్ నుంచి 454, ముమ్మిడివరం బ్లాక్ పరిధిలో 530, రామచంద్రపురం బ్లాక్ నుంచి 476, రావులపాలెం బ్లాక్‌లో 375, రాజోలు బ్లాక్ నుంచి 440 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారికి జవహర్ నవోదయ విద్యాలయ సమితి జనవరిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. ఇదిలా ఉంటే తూర్పుగోదావరి జిల్లా నుంచి 1,521, కాకినాడ జిల్లా నుంచి 3,437 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.

7న ఉషశ్రీ వర్ధంతి సభ

కాజులూరు: పల్లిపాలెం ఆంధ్రీ కుటీరంలో ఈ నెల 7వ తేదీ గురువారం జరుగనున్న ఉషశ్రీ 33వ వర్ధంతి మహాసభను విజయవంతం చేయాలని కుటీరం నిర్వాహకుడు, ప్రముఖ కవి మధునాపంతుల సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆదివారం ఆ గ్రామంలో ఆయన మాట్లాడుతూ గురువారం సాయంత్రం మూడు గంటల నుంచి జరిగే ఈ సభకు యానం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. డాక్టర్ కాళ్లకూరి శైలజ, అవధానుల మణిబాబు, దాట్ల దేవదానంరాజు, పి.వైజయంతి తదితర ప్రముఖ కవులు హాజరై ఉషశ్రీ రచనలు, ఆయన పాండిత్యంపై ప్రసంగిస్తారన్నారు. సాహిత్య ప్రియులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

రత్నగిరి.. భక్తజన లహరి

- పెళ్లి బృందాలతో సత్యదేవుని ఆలయం కిటకిట
- స్వామివారిని దర్శించిన 40 వేల మంది
- ఆదాయం రూ.40 లక్షలు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన నవదంపతులు, వారి బంధుమిత్రులు, ఇతర భక్తులతో సత్యదేవుని సన్నిధి ఆదివారం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తజనసంద్రమే అయ్యాయి. శనివారం రాత్రి, తెల్లవారు జామున రత్నగిరిపై సుమారు 200 వివాహాలు జరిగాయి. వీటికి వచ్చిన పెళ్లిబృందాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న మరో 500 మంది నవ దంపతులు, వారి బంధుమిత్రులు కూడా స్వామివారి సన్నిధికి తరలి వచ్చారు. వీరందరూ సత్యదేవుని వ్రతాలాచరించి, స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. వ్రతాలు 3,800 జరిగాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. అన్నదాన పథకంలో 4 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. భక్తుల ఏర్పాట్లను దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ పర్యవేక్షించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు.



సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు

బారులు తీరిన వాహనాలు

సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చిన భక్తుల వాహనాలతో దేవస్థానం ఘాట్ రోడ్లు, పార్కింగ్ స్థలాలు, సత్యగిరి దిగువన ఏర్పాటు చేసిన మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలం నిండిపోయాయి. ఎటు చూసినా భక్తుల వాహనాలే కనిపించాయి. దేవస్థానం సత్రాల్లో పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు లేవు. సెల్లార్‌లో కూడా గదులు నిర్మించేశారు. దీంతో సత్రాల్లో బస చేసిన వారు కూడా తమ వాహనాలను బయట నిలిపివేయాల్సిన పరిస్థితి. ఘాట్ రోడ్డుకు ఇరువైపులా భక్తుల వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు పలుమార్లు అంతరాయం ఏర్పడింది. భవిష్యత్తులో దేవస్థానంలో ఏ సత్రం నిర్మించినా వాహనాల పార్కింగ్‌కు కచ్చితంగా సెల్లార్ వదిలేయాలని పలువురు సూచిస్తున్నారు.



ఆలయంలో భక్తుల క్యూ

జోరుగా సత్యదేవుని కంకణాల విక్రయాలు

రత్నగిరిపై సత్యదేవుని ఆలయ తూర్పు రాజగోపురం వద్ద స్వామివారి కంకణాలు, శాలువాలు, కండువాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌ను గత నెల 27న కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్ ఖుబా లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ స్వామివారి పాదాల వద్ద ఉంచి, పూజ చేసిన కంకణాలను రూ.10, శాలువా రూ.350, స్వామివారి సత్యకలాలు రూ.10, స్వామివారి పవిత్రాలు రూ.225, క్షేత్రదర్శిని రూ.100, స్వామివారి కండువా రూ.120 చొప్పున విక్రయిస్తున్నారు. ఇక్కడ కంకణాలు కొనుగోలు చేసిన వారికి పురోహితులే వాటిని చేతికి కట్టి, అక్షతలు వేసి ఆశీర్వదిస్తున్నారు. ప్రతి రోజూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ విక్రయాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. కాగా వీటి విక్రయాల గురించి చాలా మంది భక్తులకు ఇంకా పూర్తిగా తెలియడం లేదు. దీనికి తోడు వీటిని విక్రయించే చోట నీడ లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ 130 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పున్న పెద్ద షెడ్డు వేయడానికి టెండర్లు పిలిచారు. అది పూర్తయ్యేంత వరకూ ఇక్కడ భక్తులకు నీడనిచ్చేందుకు షామియానా వేయించాలని పలువురు కోరుతున్నారు.

క్రీడా సంరంభం.. ఆరంభం

- ఎస్‌జీఎఫ్ పోటీలకు గ్రీన్ సిగ్నల్
- అండర్–11, 14, 17 విభాగాల్లో నిర్వహణ
- పాఠశాల స్థాయి క్రీడాకారులకు అరుదైన అవకాశం
- మొత్తం తొమ్మిది క్రీడల్లో పోటీలు

సాక్షి, అమలాపురం: క్రీడా సంరంభం ఆరంభమైంది.. ప్రతిభను చాటే వేదికకు అవకాశం వచ్చింది.. కరోనా తరువాత అరకొర క్రీడా పోటీలకు పరిమితమైన పాఠశాల, జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది పంట పండింది. గడిచిన మూడేళ్లుగా నాలుగైదు విభాగాల్లో అది కూడా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకే క్రీడాకారులు పరిమితం కావాల్సి వచ్చింది. ముఖ్యంగా క్రీడల్లో విలువైన మెరిట్ సర్టిఫికెట్ పొందే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగే పోటీలు మూడేళ్లుగా జరగడం లేదు. గత ఏడాది పోటీలు నిర్వహించినా చాలా తక్కువ క్రీడా విభాగాల్లో నిర్వహించగా, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించ లేదు. దీంతో చాలా మంది విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభ చాటేందుకు, మెరిట్ సర్టిఫికెట్ పొందేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ ఏడాది ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు కొత్తగా పలు ఎంపిక విధానాలను తీసుకు వచ్చింది.

జిల్లాలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి పోటీలు ఈ నెల 1వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. చాలా చోట్ల సోమవారం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. పదో తేదీ లోపు మండల స్థాయి ఎంపికలు పూర్తి కానున్నాయి. 11 నుంచి 20వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో జరుగనున్నాయి. తొలిదశలో మండల స్థాయిలో ఎంపిక చేసిన క్రీడల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇందుకు తొమ్మిది విభాగాల్లో క్రీడలను ఎంపిక చేశారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ క్రీడాంశాలల్లో పోటీలు జరుగనున్నాయి. వీటితో పాటు ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్ వంటి పోటీలను నేరుగా ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించనున్నారు. గతంలో అన్ని రకాల క్రీడా పోటీలను ఉమ్మడి జిల్లా స్థాయిలోనే నిర్వహించేవారు. అయితే ఎంపిక చేసిన క్రీడలను మండల స్థాయి నుంచి నిర్వహించడంతో విద్యార్థుల్లో ప్రతిభ వెలుగు చూడనుంది.

ఎవరెవరికి అవకాశం అంటే..

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు మాత్రం ఈ పోటీల్లో పాల్గొనే అర్హత లేదు. స్థానికంగా నిర్వహించే పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో ఆహారం అందిస్తారు. క్రీడాకారులను అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ చేయాల్సి ఉంది. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ పోటీలు నిర్వహించనున్నారు.



పరుగు పందెంలో తలపడుతున్న విద్యార్థులు (ఫైల్)



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు

ఎంపిక విధానం ఇలా..

గతంలో ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల నిర్వహణ ఉమ్మడి జిల్లాల స్థాయిలో ఉండేది. ఎంపికలు కూడా జిల్లా జట్టుకు నేరుగా జరిగేది. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఈ సారి తొలుత మండల స్థాయిలో నిర్వహించనున్నారు. ఇందులో ఎంపికైన జట్లకు ఈ నెల 20వ తేదీ లోపు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించి నియోజకవర్గ జట్లను ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు తొలుత కొత్త జిల్లాల స్థాయిలోనూ తరువాత ఉమ్మడి జిల్లా స్థాయిలో పోటీల నిర్వహణతో పాటు ఎంపికలు జరుగనున్నాయి. ఆపై రాష్ట్ర స్థాయిలో పోటీలు, ఆపై ఎంపికలు నిర్వహిస్తారు. ఇక్కడ ఎంపికైన వారిని జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నారు.

కొత్తగా అండర్–11

గతంలో అండర్–14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించేవారు. ఇప్పుడు వీటితో పాటు తొలిసారిగా అండర్- 11 విభాగాల్లో కూడా కొన్ని ఎంపిక చేసిన క్రీడల్లో పోటీలు జరగనున్నాయి. పాఠశాలల విలీనంలో భాగంగా మూడో తరగతి నుంచి ఐదో తరగతి వరకూ చదువుకునే విద్యార్థులను ఉన్నత పాఠశాలలకు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. వీరికి సైతం ఎస్‌జీఎఫ్ పోటీల్లో అవకాశం కల్పించనున్నారు. విద్యార్థి పుట్టిన తేదీ ఆధారంగా సంబంధిత కేటగిరీలో పాల్గొనవచ్చు. 2013 జనవరి 1వ తేదీ తరువాత పుట్టిన వారు అండర్–11 విభాగానికి అర్హులు. వారు 3 నుంచి 5వ తరగతిలోపు చదువుతూండాలి. 2010 జనవరి 1 తరువాత పుట్టిన వారు అండర్ –14 విభాగంలో పాల్గొనాలి. వీరు ఆరో తరగతి నుంచి పదో తరగతి లోపు చదువుకునేవారు అయి ఉండాలి. 2007 జనవరి ఒకటి తరువాత పుట్టినవారు అండర్–17 కేటగిరీకి అర్హులు. వీరు ఆరో తరగతి నుంచి ఇంటర్ లోపు చదువుతున్నవారు అయి ఉండాలి. ఒక విద్యార్థి ఒక ఏజ్ గ్రూపులో పాల్గొంటే మరో ఏజ్ కేటగిరీలో పాల్గొనేందుకు అవకాశం లేదు.

జాతీయ స్థాయి పోటీలకు అవకాశం



ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలు జరిగే అవకాశం ఉంది. దీని కారణంగా ముందుగానే క్రీడా షెడ్యూల్ మొదలైంది. మండల, నియోజకవర్గ స్థాయిల్లో పోటీల నిర్వహణతో క్రీడాకారుల్లో ప్రతిభ వెలుగులోకి వస్తోంది. గతంతో పోలిస్తే పోటీల నిర్వహణకు వెసులుబాటు కల్పించారు. అయితే మైదానాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు ఇస్తే మంచి ఫలితాలు ఉంటాయి.

– ఎం.రమేష్, ఎస్‌జీఎఫ్, జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

రాతి గట్టును ఢీకొన్న బోట్లు

- సుమారు రూ.12 లక్షల నష్టం



అమీనాబాదు తీరంలో దెబ్బతిన్న బోటు

కొత్తపల్లి: తీర ప్రాంతాల్లో లంగరు వేసిన రెండు బోట్ల తాళ్లు తెగిపోవడంతో శనివారం రాత్రి రాతి గట్టును ఢీకొని ధ్వంసమయ్యాయి. దీంతో సుమారు రూ.12 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఉప్పాడకు చెందిన కారే సత్యం (చిట్టబ్బాయి) తన బోటుపై వేటకు వెళ్లి వచ్చి శనివారం అమీనాబాదు తీర ప్రాంతంలో లంగరు వేశారు. కెరటాలకు లంగరు వేసిన తాడు తెగి బ్యాక్ వాటర్ వాల్‌ను ఢీకొంది. దీంతో బోటు అడుగుభాగం పూర్తిగా ధ్వంసమైంది. జేసీబీ సహాయంతో బోటును తీరానికి చేర్చారు. సుమారు రూ.10 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. అలాగే పొన్నాడ శివారు కొనపాపపేటకు చెందిన దూడా సత్తిబాబు తన బోటుపై శనివారం వేట ముగించుకుని కోనపాపపేట తీరప్రాంతంలో లంగరు వేశాడు. లంగరు ఊడి బోటు బీచ్ రోడ్డుకు రక్షణగా వేసిన రాతి గోడను ఢీకొంది. దీంతో బోటు, ఇంజిన్ దెబ్బతినగా సుమారు రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లింది.

ఆటో, బైక్ ఢీ: యువకుడి మృతి

ఐ.పోలవరం: ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఐ.పోలవరం మండలం పాత ఇంజరంలో 216 జాతీయ రహదారిపై ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. మురమళ్ల నుంచి పాత ఇంజరానికి ఆటో వెళ్తుంది. కొత్త మురమళ్లకు చెందిన లంక సురేంద్ర వంశీశ్రీ (21) యానం నుంచి ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. ఈ నేపథ్యంలో బైక్, ఆటో బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో లంక సురేంద్ర వంశీశ్రీ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

వీడిన దాంపత్య బంధం

- దైవ దర్శనానికి వెళ్తుండగా ప్రమాదం
- భర్త మృతి, అపస్మారక స్థితిలో భార్య
- పెళ్లయిన నాలుగు నెలలకే విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగదుర్గ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాత్విక



దంపతులు నాగదుర్గ, సాత్విక (ఫైల్)

తుని రూరల్: ఆనందమయ జీవనం.. అన్యోన్య దాంపత్యం.. హాయి హాయిగా సాగిపోతున్న పయనం.. ఇంతలో అనుకోని మలుపు వారి జీవితాన్నే మార్చేసింది.. ఆ దాంపత్య బంధాన్ని వీడదీసింది. దైవ దర్శనానికి దంపతులు వెళ్తుండగా లారీ మృత్యువు రూపంలో దూసుకొచ్చి భర్త మృతికి కారణమైంది. భార్య తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన తుని మండలం ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరి జంక్షన్‌లో 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగింది. తుని రూరల్ ఎస్సై వి.దేవుడు కథనం ప్రకారం.. ఉప్పాడ కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన కొంతమంది కుటుంబ సభ్యులు లోవ దేవస్థానికి వ్యాన్‌లో బయలుదేరారు. ఇందులో దార్ల నాగదుర్గ (24), అతని భార్య సాత్వికతో కలసి మోటార్ సైకిల్‌పై పయనమయ్యారు. చెట్టాపట్టాలేసుకుని సరదాగా వారు ముందుకు సాగారు. బీచ్ రోడ్డు నుంచి వచ్చిన వీరు తునిలో ఇటీవల కొత్తగా ప్రారంభించిన అండర్‌పాస్ వంతెన మీదుగా జగన్నాథగిరి జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడ బంధువుల వ్యాన్ వెళ్లిన తర్వాత మోటార్ సైకిల్‌పై ఆ దంపతులు హైవేను దాటుతుండగా, అన్నవరం వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో నాగదుర్గ రోడ్డుపై బలంగా పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సాత్విక లారీ టైరులో చిక్కుకోవడంతో కొంత దూరం ఈడ్చుకుపోయింది. దీంతో సాత్విక తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ ఎఎస్సై వి.దేవుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగదుర్గ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం బంధువులకు అప్పగించారు.

విషాదం నింపిన ప్రమాదం

ఉప్పాడ కొత్తపల్లి మండలం నాగులాపల్లి గ్రామానికి చెందిన దార్ల నాగదుర్గ వాకలపూడి వద్ద కోరమాండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. సంబంధం కుదరడంతో ఈ ఏడాది మే 10న పామగుంటకు చెందిన సాత్వికను వివాహం చేసుకున్నాడు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగుతుంది. కుటుంబ సభ్యులంతా సంతోషంగా దైవ దర్శనానికి బయలుదేరిన కొంత సేపటికే మృత్యుశకటంలా వచ్చిన లారీ ఆ కుటుంబంలో పెను విషాదాన్ని మిగిల్చింది. నాగదుర్గ మృతితో పాటు అపస్మారక స్థితిలో ఉన్న సాత్వికను చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. నాగదుర్గ, సాత్వికల కుటుంబ సభ్యులు, ఆయా గ్రామస్తులు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంగణంలో విషాదం నెలకొంది.

పిడుగుపాటుకు పశువుల పాకల దగ్ధం



కాలిపోయిన పాకలను పరిశీలిస్తున్న వీఆర్వో పట్టాభి రామారావు తదితరులు

కె.గంగవరం: అముజూరు గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షానికి పిడుగు పడి మూడు పశువుల పాకలు కాలిపోయాయి. స్థానిక వీఆర్వో పట్టాభి రామారావు కథనం ప్రకారం.. అముజూరు గ్రామానికి చెందిన మేడిశెట్టి ప్రసన్న, మేడిశెట్టి శివప్రసాద్, పెంకే చిట్టియ్యలు అముజూరు–నరజాడ రహదారిలో మెయిన్ రోడ్డు పక్కనే సొంత స్థలంలో పశువుల పాకలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అక్కడ ఉరుములతో కురిసిన భారీ వర్షానికి చెట్టుపై పిడుగు పడింది. చెట్టు చుట్టూ మంటలు వ్యాపించడంతో కింద ఉన్న ఆ పాకలు కూడా అగ్నికి ఆహుతయ్యాయి. అర్ధరాత్రి సమయంలో వివాహానికి వెళ్లి వస్తున్న కొందరు పిడుగుపాటును గుర్తించి వెంటనే పశువుల పాకల యజమానులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. కానీ అగ్నికి గాలి తోడవ్వడంతో మూడు పాకలూ పూర్తిగా కాలిపోయాయి. పాకలలో ఉన్న ఒక గేదె, దూడ మృతి చెందగా, మరో పాడి గేదె, దూడలకు 80 శాతం గాయాలయ్యాయి. వీటికి పామర్రు పశు వైద్యాధికారి బిందు చికిత్స చేశారు. ఆమె సమాచారంతో డీఏహెచ్‌ఓ కె.వెంకటరావు సంఘటనా స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి సాయం అందించేలా జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేస్తామని పాడి రైతులకు హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం ఉంటుందని వీఆర్వో తెలిపారు.

కాలువలో పడి వివాహిత ఆత్మహత్య



మృతురాలు కరణం రమాదేవి (ఫైల్)

కిర్లంపూడి: కాలువలో పడి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.ఉమా మహేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వేలంక గ్రామానికి చెందిన కరణం రమాదేవి (28)కి పదేళ్ల కిందట బూరుగుపూడికి చెందిన కరణం లోవఅబ్బాయితో వివాహం జరిగింది. వీరికి ముఖేష్, బాల వెంకటేశ్ ఇద్దరు కుమారులు. కొంత కాలంగా భర్త మద్యానికి బానిసై ఇంటికి వస్తుండటంతో తరచూ భార్యాభర్తలు గొడవపడేవారు. తన భర్తలో ఎటువంటి మార్పు రాకపోవడంతో రామాదేవి తీవ్ర మనస్తాపానికి గురైంది. రెండు రోజుల కిందట తన తల్లి ఇంటికి వెళతానని చెప్పి వెళ్లి కనిపించకపోవడంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో శనివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం జగ్గంపేట మండలం రామవరం సమీపంలోని పోలవరం కాలువలో రామాదేవి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై ఉమా మహేశ్వరరావు తెలిపారు. మృతురాలి తల్లి పెద్దిరెడ్డి లోవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



మృతి చెందిన సుంకర త్రిమూర్తులు

అల్లవరం: రొయ్యల చెరువు వద్ద విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. భీమవరానికి చెందిన ఆక్వా రైతు కలిదిండి శ్రీనివాసరాజుకు మండలంలోని ఎస్.పల్లిపాలెంలో రొయ్యల చెరువు ఉంది. అక్కడ రోజు వారీ కూలీగా సామంతకుర్రు గ్రామానికి చెందిన సుంకర త్రిమూర్తులు (57) పని చేస్తున్నారు. ఈ చెరువులో ఆక్సిజన్ కోసం ఏర్పాటు చేసిన ఏరియేటర్ ఆగిపోయింది. కరెంట్ ఉన్నా ఏరియేటర్ తిరగకపోవడంతో త్రిమూర్తులు చెరువులోకి దిగి ఎందుకు తిరగడం లేదోనని పరిశీలించే ప్రయత్నం చేశాడు. అయితే ఏరియేటర్‌లోని విద్యుత్ మోటార్ హైపవర్‌కు కాలిపోయి విద్యుత్ సర్క్యూట్ అవుతుంది. ఇది గమనించని త్రిమూర్తులు విద్యుత్ మోటార్‌ను పట్టుకోగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే పనిచేస్తున్న కూలీలు గుర్తించి పరుగు పరుగున వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అయితే అప్పటికే త్రిమూర్తులు మృతి చెందారు. విద్యుత్ షాక్‌కు గురైన త్రిమూర్తులును ఒడ్డుకు చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. అల్లవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధవళేశ్వరం: స్థానిక హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం రైల్వే పోలీసులు గుర్తించారు. అతడి వయసు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. నలుపు రంగు టీషర్ట్, ఎరుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. కుడి చేతికి పన్నెండు రాఖీలు కట్టి ఉన్నాయి. అతడు రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రాజమహేంద్రవరం రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై లోవరాజు కోరారు.

ఈత సరదా తీసింది ప్రాణం



తరుణ్‌కుమార్ మృతదేహం

గండేపల్లి: ఈత సరదా ఓ యువకుడి ప్రాణం తీసింది.. కన్నవారికి కడుపుకోతను మిగిల్చింది.. చెరువులో ఈత కొడుదామని వెళ్లిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన కె.నాయకంపల్లిలో జరిగింది. గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లా పచ్చవ గ్రామానికి చెందిన కోయి తరుణ్‌కుమార్ (21) గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తోటి స్నేహితులతో కలసి కె.నాయకంపల్లి పరిధిలోని తిమ్మరాజు చెరువు వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో చెరువులో మునిగిపోయాడు. దీనిని గమనించిన స్నేహితులు బయటకు తీసి స్థానికంగా ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి కృష్ణారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

9న బాస్కెట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం: విజయవాడలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే జిల్లా స్థాయి త్రి ఇన్ టూ త్రి మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 9న రామచంద్రపురంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు తెలిపారు. విజయవాడలోని స్టెల్లా కాలేజీలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకూ మార్టేరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి త్రి ఇన్ టూ త్రి మహిళల, పురుషుల బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్ల ఎంపిక ఈ నెల 10న రామచంద్రపురంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తా పడిన వ్యాన్, పక్కన బస్సు



108లో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

- ఐదుగురికి గాయాలు

రాజానగరం: పలాస నుంచి భద్రాచలానికి 37 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ను ఢీకొంది. బస్సు రహదారి దిగువకు ఒరిగి పోగా, వ్యాన్ బోల్తా పడింది. జాతీయ రహదారిపై దివాన్‌చెరువు వద్ద ఆదివారం తెల్లవారు జామున జరిగిన ఈ ప్రమాదంతో బస్సులోని ఐదుగురికి గాయాలయ్యాయి. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. పలాస ఆర్టీసీ డిపో నుంచి భద్రాచలానికి శనివారం రాత్రి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ బస్సు దివాన్‌చెరువు వద్దకు వచ్చే సరికి అనకాపల్లి నుంచి సూర్యాపేటకు కర్రల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్‌ని అధిగమించే ప్రయత్నం చేసి ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన ఐదుగురిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ గుణశౌరి విజయకుమార్ కాలికి తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతుండగా, మిగిలిన నలుగురికి ప్రాథమిక చికిత్స అందించి పంపించి వేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు బొమ్మూరు ఎస్సై జగన్ మోహనరావు తెలిపారు.

తొర్రిగెడ్డ కాలువలో వ్యక్తి మృతదేహం

రాజానగరం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధి కొంతమూరు తొర్రిగెడ్డ కాలువలో తుమ్మూరి వెంకటేష్ (19) మృతదేహాన్ని పోలీసులు ఆదివారం కనుగొన్నారు. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం.. సీతానగరం మండలం ఉండేశ్వరపురానికి చెందిన వెంకటేష్ మెకానిక్ షెడ్‌లో పనిచేస్తున్నాడు. అతని జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదని తల్లి మందలించింది. దాంతో మనస్తాపం చెందిన అతను గత నెల 29న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తొర్రిగెడ్డ కాలువలో మృతదేహమై కనిపించాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

టీటీడీ సభ్యుడిగా 'పొన్నాడ' ప్రమాణ స్వీకారం



టీటీడీ పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యే పొన్నాడతో నాయకులు

ముమ్మిడివరం: తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల టీటీడీ నూతన పాలక మండలి సభ్యుల జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. పాలక మండలి సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడను నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనకు దేవస్థానం అధికారులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్యేను పలువురు అభినందించారు. ఆయన వెంట ఆమె సతీమణి నీరజ, కుమారులు సుమంత్, రేవంత్, కుటుంబ సభ్యులు నాయకులు డిల్లీ నారాయణ, నేల కిశోర్, పిన్నమరాజు శ్రీనురాజు, యానాం రామూర్తి తదితరులు ఉన్నారు.

నిందితుల ఆచూకీ కోసం జల్లెడ

- మరో ఏడు పోలీసు బృందాల ఏర్పాటు
- దుకాణం దహనం, ఇల్లు ధ్వంసంపై కేసుల నమోదు
- అమలాపురంలో కొనసాగుతున్న పోలీసు పహారా

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీ షీటర్ హత్య, మరో వ్యక్తిపై హత్యాయత్నం కేసులను జిల్లా పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది. హత్య, హత్యాయత్నం చేసి పరారీలో ఉన్న రౌడీషీటర్ ఆనంద్, అతని అనుచరులు సతీష్, సుధీర్, ఇంద్ర తదితరుల ఆచూకీ కోసం పోలీసు ప్రత్యేక బృందాలను మరిన్ని పెంచి ఉభయ రాష్ట్రాల్లోని ముఖ్య నగరాల్లో గాలిస్తున్నారు. హత్య జరిగిన రోజు రెండు పోలీసు బృందాలను సెర్చ్ పార్టీలుగా నియమిస్తే వాటిని మరో ఏడుకు పెంచి మొత్తం 9 బృందాలను రంగంలోకి దింపారు. రౌడీషీటర్ పోలిశెట్టి కిషోర్ హత్య, అతని సహచరుడు అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం చేసిన ఘటనను నిరసిస్తూ వారి వర్గీయులు ప్రత్యర్థులకు చెందిన ఇద్దరి ఆస్తుల విధ్వంసానికి దిగిన సంగతి తెలిసిందే. టీడీపీ నాయకుడు, మాజీ రౌడీషీటర్ గంధం పల్లంరాజుకు చెందిన అమలాపురం ఎర్ర వంతెన వద్ద గల సప్తగిరి అపార్ట్‌మెంట్స్‌లోని దుకాణం దహనం, ఈదరపల్లిలో బళ్ల సతీష్ ఇంటిని ధ్వంసం చేసిన ఘటనలపై అందిన ఫిర్యాదులతో పట్టణ పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. 400 మంది పోలీసులతో పహారా ఆదివారం కూడా కొనసాగింది. హత్యకు పాల్పడ్డారన్న ఆరోపణలపై బాధిత వర్గం నుంచి నిందితుల ఇళ్ల వద్ద దాడులు, ధ్వంసాలకు అవకాశం లేకుండా పోలీసు పికెట్లు కూడా కొనసాగుతున్నాయి. మొత్తం 15 పోలీసు పికెట్లతో ముఖ్య కూడళ్లతో పాటు నిందితుల ఇళ్ల వద్ద బందోబస్తు నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. వారి ఇళ్లపైనే కాకుండా సెల్‌ఫోన్ల ట్రాకింగ్‌పై కూడా నిఘా పెట్టారు. వారి స్నేహితుల కదిలికలపై కన్నేసి ఉంచారు.

మరోసారి డీఐజీ సమీక్ష

హత్య జరిగినప్పటి నుంచీ ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ అమలాపురంలోనే మకాం ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు చేపడతున్నారు. డీఐజీతో పాటు జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ రవిప్రకాష్‌లు కూడా ఎప్పటికప్పుడు పరిస్థితిని అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి సమీక్షిస్తున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా సమీక్షలు చేసిన డీఐజీ ఆదివారం ఉదయం కూడా ఎస్పీలు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో నిర్వహించిన సమీక్షలో జరిగిన ఘటనపై లోతుగా చర్చించారు. రౌడీ షీటర్లను అదుపు చేయడంలో జరిగిన లోపాలపై ఆయన చర్చించి సీరియస్ అయినట్లు తెలిసింది. రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్లకు పిలిపించి సీరియస్‌గా కౌన్సెలింగ్‌లు, వార్నింగ్‌లు ఇస్తున్నారు.

నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా

- ముఖ్యమంత్రి ఆదేశాలతో చర్యలు
- ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ మూర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు గృహ, వ్యవసాయ విద్యుత్తు వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాజమహేంద్రవరం ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీర్ (ఆపరేషన్స్) టీవీఎస్‌ఎన్ మూర్తి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా పరిశ్రమల విద్యుత్ వినియోగంపై పరిమితులు విధించి గృహ వినియోగానికి నిరంతరం, వ్యవసాయానికి తొమ్మిది గంటలు నిరంతరాయంగా 3–ఫేజ్ సరఫరా చేస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాల మేరకు లోడు నియంత్రిస్తామని అన్నారు. ప్రస్తుతం వినియోగదారులకు ఎటువంటి విద్యుత్ కోతలు లేవని పేర్కొన్నారు. పరిశ్రమలకు పవర్ హాలిడే వారంలో ఒక రోజు డివిజన్ వారీగా అమలు చేస్తామన్నారు. సోమవారం జగ్గంపేట డివిజన్, మంగళవారం కాకినాడ డివిజన్, బుధవారం పెద్దాపురం డివిజన్, గురువారం రాజమహేంద్రవరం రూరల్ డివిజన్, శుక్రవారం అమలాపురం డివిజన్, రంపచోడవరం డివిజన్, శనివారం రాజమహేంద్రవరం అర్బన్ డివిజన్, రామచంద్రపురం డివిజన్లలో పవర్ హాలిడే పాటించాలన్నారు.

డివిజన్ స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు

రాజమహేంద్రవరం సర్కిల్ ఆఫీస్	– 73822 99960
రాజమహేంద్రవరం టౌన్ డివిజన్	– 94408 12585
రాజమహేంద్రవరం రూరల్ డివిజన్	– 73825 85487
కాకినాడ డివిజన్	– 94408 12586
పెద్దాపురం డివిజన్	– 83338 18099
జగ్గంపేట డివిజన్	– 94408 12589
అమలాపురం డివిజన్	– 94408 12588
రామచంద్రపురం డివిజన్	– 94408 12587
రంపచోదవరం డివిజన్	– 73825 85554

కవులకు సాహితీ కళాపీఠం ఆహ్వానం



అంబాజీపేటలో సాహితీ కళాపీఠం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళాకారులు

అంబాజీపేట: కళారంగంలో ప్రతిభ కలిగి, ఆర్థిక వెనుకబాటు కలిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కవులను గుర్తించి అవార్డులు ప్రదానం చేసేందుకు అరిగెల బలరామమూర్తి సాహితీ కళాపీఠం ఆహ్వానిస్తోందని కళాపీఠం వ్యవస్థాపకుడు అరిగెల బలరామమూర్తి తెలిపారు. ఆదివారం అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న కళాపీఠం కార్యాలయంలో సాహితీ, కళాపీఠం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్య ప్రధానమైన కవితలు 20 లైన్లకు మించకుండా ఉండాలని, వాటిని ఈ నెల 5 నుంచి అక్టోబర్ 15 వరకూ పోస్ట్ ద్వారా గాని, స్వయంగా గాని అందజేయాలన్నారు. కవితతో పాటు, హామీ పత్రం, కవి ఫోటో జతపర్చాలన్నారు. అక్టోబర్ చివరిలో ఉత్తమ కవితలను ఎంపిక చేసి, నవంబర్‌లో బహుమతుల ప్రదానం చేస్తామన్నారు. హాస్య కవితలలో ప్రథమ స్థానం పొందిన వారికి రూ.5,116 నగదు బహుమతితో పాటు అవార్డు ప్రదానం, సన్మానాలు చేస్తామని బలరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో నల్లా నరసింహామూర్తి, పరసా సుబ్బారావు, బీవీవీ సత్యనారాయణ, అరిగెల వెంకటేశ్వరరావు, శ్రీపాద రామకృష్ణ, గాదరాడ రవిచంద్ర, ఏడిద కవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు

- ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దు
- ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు



రోడ్డు భద్రతపై చేపట్టాల్సిన చర్యలను వివరిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రహదారులపై రాంగ్ రూట్‌లో వెళ్లి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాలకు చెందిన సీఐలు, ఎస్సైలతో ఆదివారం ఆయన రోడ్డు భద్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మూడు నెలల కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల నివేదిక తీసుకుని ఆ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలకు నెలవుగా ఎన్ని బ్లాక్ స్పాట్లు ఉన్నాయో గుర్తించాలన్నారు. హైవేలపై వెళ్తున్న లారీలను ఆపి డ్రైవర్లకు రోడ్డు భద్రతపై కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. డివైడర్లు దాటకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎంత చెబుతున్నా తల్లిదండ్రులు వినడం లేదని, వాహనాలు ఇచ్చిన యజమానులపై కేసులు నమోదు చేయాలన్నారు. అలాగే ట్రిబుల్ రైడింగ్ నిరోధించాలన్నారు. సమావేశంలో టూ టౌన్ సీఐ టి.గణేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.